## క్లుప్తంగా

### నేడు ఎమ్మెల్యే పర్ణికారెడ్డి జన్మదిన వేడుకలు

**నారాయణపేట:** నారాయణపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అనుచరులు, అభిమానులు పేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి జన్మదినాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలోని మెట్రో గార్డెన్‌లో ఎమ్మెల్యేకు సన్మానం చేయనున్నారు. ఉదయం 8 గంటలకు నారాయణపేట పట్టణం సాయి విజయ కాలనీలో సాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజాలు నిర్వహిస్తారు. 9 గంటలకు సిటిజన్ క్లబ్ వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అక్యుప్రెసర్ క్యాంప్, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం ప్రారంభిస్తారు. 10 గంటలకు వైదిక పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ, 10:30 గంటలకు సాయి హాస్పిటల్ (ఓల్డ్ బస్టాండ్) వద్ద మెడికల్ క్యాంపు, 11 గంటలకు ప్రభుత్వ చిన్న పిల్లల ఆస్పత్రి వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. సింగారం చౌరస్తా నుంచి బైక్ ర్యాలీతో నర్సిరెడ్డి చౌరస్తాకు చేరుకొని ఎమ్మెల్యేకు గజమాలతో సత్కార కార్యక్రమం నిర్వహించనున్నారు.

### పీడీఎస్‌యూ కమిటీ ఎన్నిక

**ఊట్కూరు:** మండలంలోని అవుసలోనిపల్లిలో ఆదివారం రాత్రి పీడీఎస్‌యూ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా పరశురాం, ఉపాధ్యక్షుడిగా అరవింద్, సహాయ కార్యదర్శిగా కృష్ణ, కోశాధికారిగా శివ తదితరులను సహాయ కార్యదర్శులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కిరణ్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### 21న వంట కార్మికుల ధర్నా

**మరికల్:** మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 21న జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా నాయకులు సంతోష్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు తమ ఉద్యమం ఆగదని, ధర్నాలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

### ఎస్ఐగా బాధ్యతల స్వీకరణ


పి.అశోక్‌బాబు

**మాగనూర్:** మాగనూర్ ఎస్ఐగా పి.అశోక్‌బాబును నియమిస్తూ.. ఎస్పీ యోగేష్‌గౌతమ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్థానికంగా పనిచేస్తున్న అబ్దుల్‌ఖాదర్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నటువంటి ఎస్ఐ పి.అశోక్‌బాబు మాగనూర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలంతా సహకరించాలని కోరారు. ప్రతి వాహనదారుడు లైసెన్స్ తప్పకుండా పొంది ఉండాలని సూచించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్యాసింజర్లను తరలించవద్దని, అలా చేస్తే చర్యలు తప్పని హెచ్చరించారు.

### పరిసరాల పరిశుభ్రత పాటించాలి



**మాగనూర్:** పరిసరాల పరిశుభ్రత పాటించాలని మండల ప్రత్యేక అధికారి ఈశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, బాల, బాలికల వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రమేష్‌కుమార్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ నిల్వ ఉన్న నీరు, పరిసరాలను పర్యవేక్షించారు. శానిటేషన్ సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి, వాటిని సంరక్షించాలని సూచించారు.

### తప్పిపోయిన బాలుడి అప్పగింత

**ఊట్కూరు:** మండలంలోని తిప్పరాసిపల్లి నర్సప్పతాత దేవాలయం వద్ద సోమవారం ఓ బాలుడు ఆకాశ్ రోడ్డుపై తిరుగుతుండగా.. ఊట్కూరుకు చెందిన డ్రైవర్ వడ్ల ప్రవీణ్ పోలీసులకు అప్పగించాడు. పోలీసులు సమాచారాన్ని వాట్సాప్ గ్రూప్‌లో తెలియజేశారు. విషయం తెలుసుకున్న లక్ష్మీపల్లికి చెందిన కనకప్ప వారి కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బాలుడిని తీసుకెళ్లారు. హెడ్‌కానిస్టేబుల్ సురేందర్ వివరాలు తెలుసుకుని బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

### నోట్‌బుక్స్ పంపిణీ

**ఊట్కూరు:** ఊట్కూరులోని మిల్లత్ పాఠశాలలో సోమవారం మహ్మద్ యూనూస్ మెమోరియల్ అండ్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మంజూర్ అహ్మద్, ఇసాక్, మహ్మద్ ఇస్మాయిల్, ఖుర్షిద్, షాకీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రక్షాబంధన్


ఊట్కూర్ సరస్వతి శిశుమందిర్‌లో


మాగనూర్‌లో రాఖీ వేడుకలో..


మక్తల్‌లో రాఖీ కడుతున్న స్నేహితులు


పల్లెదవాఖానాలో డాక్టర్ సయ్యద్ హబీబ్‌కు రాఖీ కడుతున్న డాక్టర్ విరోజా

**సాక్షి నెట్‌వర్క్:** ఆత్మీయతల.. అనుబంధాల రాఖీ పండుగను సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అక్కాచెల్లెల్లు, అన్నదమ్ములకు రాఖీలను కట్టి తమ అనుబంధాలను, అనురాగాలను స్వీట్లు తినిపించి పంచుకున్నారు.

- నారాయణపేట పట్టణంలోని హంసవాహిని పాఠశాలలో బైరంకొండకు చెందిన పవన్‌కళ్యాణ్ హిందూ అబ్బాయికి అహీన్‌పూర్‌కు చెందిన ముస్లిం అమ్మాయి రేష్మబేగం రాఖీ కట్టింది. మక్తల్ పల్లెదవాఖానాలో పనిచేస్తున్న ముస్లిం డాక్టర్ సయ్యద్ హబీబ్‌కు జాజాపూర్‌కు చెందిన డాక్టర్ విరోజా రాఖీ కట్టింది.
- రక్షాబంధన్ వేడుకలను సోమవారం నారాయణపేట విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. నారాయణపేటలోని సరస్వతీ శిశుమందిర్, హంసవాహిని, శ్రీసాయి స్కూల్‌లో ఊట్కూరులోని సరస్వతీ శిశుమందిర్‌లో విద్యార్థినులు రాఖీలు కట్టి వేడుకలు చేపట్టారు.


నారాయణపేట సరస్వతి శిశుమందిర్ స్కూల్‌లో..


నారాయణపేటల్లో హిందూ అబ్బాయికి రాఖీ కడుతున్న ముస్లిం అమ్మాయి


మరికల్ ఎస్ఐ మురళికి రాఖీ కడుతున్న మహిళ పోలీస్


ఊట్కూరు పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ సిబ్బందికి రాఖీలు కడుతున్న చిన్నారి


మరికల్‌లో అన్నలకు రాఖీలు కడుతున్న చెల్లెల్లు


కోస్గిలో అన్నయ్యలకు రాఖీ కడుతున్న చిన్నారులు


నర్వలో తమ అక్కల వద్దకే వెళ్లి రాఖీ కట్టించుకుంటున్న తమ్ముడు నర్వ కృష్ణారెడ్డి


మక్తల్‌లో అన్నయ్యలకు రాఖీ కడుతున్న చెల్లెలు


మద్దూరులో అన్నయ్యలకు రాఖీ కడుతున్న చెల్లెళ్లు


మాద్వార్‌లో తమ్ముడికి రాఖీ కడుతున్న అక్క



## భక్తమార్కండేయుడికి ప్రత్యేక పూజలు


మార్కండేయ పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

**నారాయణపేట:** శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం మండలంలోని కొల్లంపల్లిలో పద్మశాలీలు కులదైవమైన భక్త మార్కండేయ స్వామివారి పల్లకీసేవ ఊరేగింపు నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకం, బిల్వార్చన పుష్ప అలంకరణ మహా మంగళహారతి నైవేద్యం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

**మద్దూరులో..**

**మద్దూరు:** రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని మండల పద్మశాలీల ఆధ్వర్యంలో మార్కండేయ స్వామి పల్లకీ సేవా సోమవారం నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేకాభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పద్మశాలీలు ఎల్లప్ప, రాఘవేందర్, వెంకటేష్, రామకృష్ణ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

**మరికల్:** మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా భక్త మార్కండేయ స్వామి పల్లకీసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం నుంచి ప్రధాన రహదారుల వెంట భజనలు చేస్తూ.. పల్లకీసేవ నిర్వహించడంతో భక్తులు దర్శించుకున్నారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు కర్లి కృష్ణయ్య, వెంకటేష్, సుదర్శన్, శ్రీకాంత్, బాల్‌రాజ్, సదన్‌రావు, నిఖిల్ పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం


మక్తల్‌లో నివాళి అర్పిస్తున్న ఫొటో గ్రఫీ సంఘం నాయకులు

**మక్తల్:** ప్రపంచ ఫొటో గ్రఫీ దినోత్సవం సందర్భంగా సోమవారం మక్తల్ పట్టణంలో ఫొటో వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పడమటి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద లూయిస్ డాగ్రే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ఫొటోగ్రఫీ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఇంటి స్థలం, డబుల్ బెడ్రూం ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. అందరం కలిసికట్టుగా ఉండి, తమ సమస్యలను పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు బి.శ్రీనివాస్‌లు, వి.శ్రీనివాస్ చారి, పాపిరెడ్డి, వెంకటేష్, బాల్‌రాజ్, నరేష్, వెంకట్ పాల్గొన్నారు.

**లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..**

**ఊట్కూరు:** ఊట్కూరులో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లూయిస్ డాగ్రే చిత్రపటానికి పూలమాలలు వేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సీనియర్ ఫొటో గ్రాఫర్ అశోక్‌ను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. జనార్దన్‌రెడ్డి, వసంత్‌కుమార్ పాల్గొన్నారు.

### అవమానించిన వారిని అరెస్ట్ చేయాలి

**కృష్ణా:** మండలంలోని ముడుమాల్ యాదవేంద్ర స్వామి మఠం పూజారి దళితులను అవమానించి, పెళ్లిని అడ్డుకున్నందుకు అతడిని అరెస్ట్ చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో గ్రామంలోని అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పృథ్వీరాజ్, నాగేష్, క్యాజ్, మద్దిలేటి, నర్సింహా పాల్గొన్నారు.

### మండప నిర్వాహకులకు శాంతి సమావేశం

**మరికల్:** శాంతియుత వాతావారణంలో గణేష్ వేడుకలను నిర్వహించుకోవాలని ఎస్ఐ మురళి సూచించారు. మరికల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం వినాయక మండప నిర్వాహకులు, ముస్లింలతో శాంతి సమావేశం నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో విగ్రహాలను ఏర్పాటు చేసుకొని నిర్వహించుకోవాలని సూచించారు. అందరూ 9 రోజుల పాటు పూజలు చేసి ఒకేసారి నిమజ్జనం చేయాలని మండప నిర్వాహకులకు తెలియజేశారు.

## చౌడేశ్వరి మాత జల్ది బిందె ఊరేగింపు


పేట చౌడేశ్వరి మాత జల్దిబిందె ఊరేగిపులో పాల్గొన్న భక్తులు

**నారాయణపేట:** చౌడేశ్వరి మాత అఖండ జ్యోతుల ఉత్సవాల్లో భాగంగా సోమవారం బ్రాహ్మణవాడి చౌడేశ్వరి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అవధూత మఠం నుంచి మేళతాళాలతో భజన సంకీర్తనలతో జల్ది బిందె ఊరేగింపు నిర్వహించారు. అంతకు ముందు అమ్మవారి మూల విరాట్ విగ్రహానికి పంచామృతాభిషేకం, మహా మంగళ హారతి నిర్వహించారు.

**మద్దూరు:** మండల కేంద్రంలో వెలిసిన చౌడేశ్వరీ దేవి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొగుట వీర క్షత్రియులు ఆధ్వర్యంలో ఉదయాన్నే మద్దూరు శివారులోని శివాలయం నుంచి దేవి జల్దిబిందె ఊరేగింపు నిర్వహించారు.

## అంగరంగ వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన


నూతన విగ్రహాలకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

**కృష్ణా:** మండలంలోని హిందూపూర్‌లో సోమవారం నూతనంగా బొడ్రాయి, నవగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయంలో హోమాలు నిర్వహించి, వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య, వందలాది మంది భక్తుల సమక్షంలో అంగరంగా వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. అనంతరం ఆలయంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులతో పాటూ చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు.

## రోడ్డు భద్రత నియమాలపై అవగాహన


ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్ బాలరాజు

**నారాయణపేట:** వాహనదారులు.. పాదాచారులు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ బాలరాజు సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సావర్కర్ చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు, వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు గురికారాదన్నారు. సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో దొరికితే జరిమానాతో పాటు జైలుకు పంపుతామన్నారు. వాహనదారులు ప్రధాన రోడ్డుపై వాహనాలను నిలుపరాదన్నారు. ఆటోలో ఎక్కువ మంది పిల్లలను, కూలీలను ఎక్కించుకోరాదన్నారు. డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడరాదన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు గోవింద్ రెడ్డి, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

**హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలి**

**మరికల్:** వాహనదారులు సెప్టెంబర్ నుంచి హెల్మెట్ పెట్టుకొని బైక్‌లు నడిపించాలని సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్ఐ మురళి అన్నారు. మరికల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. మారిన కొత్త చట్టాల నిబంధనల ప్రకారం బైక్‌లు నడిపించే వారందరికీ హెల్మెట్ ఉండాలని, లేకుంటే వారి బైక్‌లు సీజ్ చేస్తామన్నారు. మద్యం తాగి, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుకుంటూ వెళ్లడం, మైనర్లకు వాహనాలు ఇస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.